# కామధేనువు


భోజు సత్యనారాయణ

"ఏడుత్తున్నావటే గవురితల్లో? ఏడకు... ఏడకు. ఏడిసి ఏటి సేత్తాం దానికి బూమీద నూకలు సెల్లిపోనాయి. ఇగమంతుని సెలవయింది. అది ఎల్లి పోయింది. మనసేతిలో ఏవుంది? అది మయిమ. ఊరుకో! ఏడకు. ఏడిసి ఏడిసి కల్లు పుల్లుపడిపోతాయిగాని సచ్చినోరు మల్లా తిరిగిరారుగందా!" అని రాజులమ్మ కట్టుకొయ్యకు కట్టివున్న అవుకి గడ్డివేసూ గొణుక్కుంటోంది. గౌరి రాజులమ్మవంక, దూడ కట్టుకొయ్య దగ్గర కనిపించక, కట్రాటవంకా మార్చి మార్చి చూసూ చెవులు ఆడిసూంది.

దూడ చచ్చిపోయిన గౌరి హృదయ విదారక మయిన చూపులకు రాజులమ్మ గుండె తీవ్రంగా కుంచింది. గుండె చెరువయింది. గౌరి శోకం తనకు మూడేళ్ళ క్రితం కలిగిన గర్భశోకం తిరగతోడింది. కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ బాధను దిగమింగి, "నీకు ఊసులు రాక అలా సూత్తున్నావు. నాను నోరుండి ఏటి సేసేను. సేతికి అందొచ్చిన సెట్టంత బిడ్డని ఆడిపెళ్ళాన్ని గోదారి మింగేత్తే నానోరెట్టికొని ఏడిసాను అంతే! అంత తప్పించి ఏటి సెయ్య కలిగాను. గంగమ్మ తల్లి పేనాలు తీసేసుకుని ఇవతలికి తోసేసిన కొడుకు ఆడిపెళ్ళాం కట్టెల్ని తీసుకొచ్చి కాటిలో బుగ్గిసేసి సేతులు కడుకొని కూకున్నానేగాని అణ్ణి తీసుకు రాగలిగేనా! నా బిడ్డడు కడుపున పుట్టిన సీతను సూసుకుని కొంత పూరటిల్లాను. దాని మీదే-పానాలెట్టుకున్నాను. నీకు తెలదటే గవురి, అప్పుడు నానెంత కుమిలి పోనానో అంసేత నాకు కడుపుతీపి తెల్దటే, నీ బాద. ఏటిసేత్తాం బతికినన్నాళ్ళు పెపంచంలో ఏటి జరుగుద్దో అది సూత్తూ కూకుండడం తప్ప మనమేటి సెయ్యగల్దుం"

"అయ్యో! ఎర్రితల్లి అట్టా దిక్కులు సూత్తావేటి. గడ్డితిను" అంటూ, గంగడోలు రాసూ రాజులమ్మ గౌరిని గోము చేసింది.

రాజులమ్మ గౌరి పొదుగు చూసింది. పొదుగు బిగిసి పురితో సన్నులు చేపొచ్చి కనిపించాయి. నిన్న మధ్యాహ్నం దూడ చచ్చిపోయిందన్న దిగులుతో రాత్రి పాలు పితకాలన్న ధ్యాసేలేదు. అలా జరిగినందుకు తనను తాను తిట్టుకుంది. నొచ్చుకుంటూ పాలముంత తేవటానికి గుడిశవైపు నడిసింది. రాజులమ్మని చూసి గౌరి అంబా!" అని అరుసూ కిందకి పైకి తల ఆడించి రమ్మన్నట్టుగా సైగ చేసింది.



రాజులమ్మ అగి "అగు తల్లి, ముంత తెస్తా పాలుతియ్యక సన్నకట్టులు సలుపుతున్నాయా, ఎర్రితల్లి" అని పాకలోనికి వెళ్ళి, పాలముంత తెచ్చి, చిరపైకి ఎగదోసుకుని, అవు పొదుగుదగ్గర మొక్కలపీట మీద కూర్చుని, నీళ్ళతో సన్నకత్తులు కడిగి చేపదీసింది గౌరి కదలలేదు. వేగం పాలు తీసెయ్యమన్నట్టు నుంచుంది.

పాలుపితికి, గౌరి వెన్నుమిద తడిచేయి రాసి తట్టింది. పిడకలు దాయిలికి అగ్గి ముట్టించి, పాలసట్టి దానిమీద పెట్టి, సద్ది అన్నంతిని, మజ్జిగ కుండను గంపలోపెట్టి, నెత్తిమీద చుట్టకుదురు పెట్టుకొని దానిమీద గంప పెట్టుకొని, ఒక చేత్తో గంప పట్టుకుని, రెండో చేత్తో కర్రపట్టుకుని ముందుకు నడిచింది రాజులమ్మ.

* * * * *

మార్కెటు సెంటరు మర్రిచెట్టు నీడలో రాజులమ్మ నెత్తిమీదున్న గంప దించుకుని, చెట్టు మొదట వున్న కుదిటిలో పెట్టింది. ప్రక్కన వున్న బఠానీల కొట్టు బసవయ్యతో కడవను చూస్తూ వుండమని చెప్పి, మరో కడవ పట్టుకొని ఎదురుగా ఉన్న నూతి దగ్గరకు వెళ్ళింది. కుండనిండా మంచినీళ్ళు తెచ్చి దగ్గర పెట్టుకొని కూర్చొని, గ్లాసులు ప్రక్కన పెట్టి బేరానికి ఉపక్రమించింది.

ఆ ఊరివారు. మార్కెట్టువారు రాజులమ్మ దగ్గర మజ్జిగ కొనుక్కొని పట్టుకు పోతుంటారు. ఆ మజ్జిగకు అంత ప్రత్యేకత వుంది. రాజులమ్మ మజ్జిగలో నీళ్ళు ఎక్కువగా కలపదు, తగు మాత్రం నీళ్ళు కలపడంవల్ల మజ్జిగ చిక్కగాను, కమ్మగాను వుంటుంది. మజ్జిగ కొనుక్కొనేవారు, "రాజులమ్మా మజ్జిగ ఇంత కమ్మగా వుంటుంది. ఏం కలుపుతావు" అని అడుగుతారు.

"అది కాపు కాయడంలో వస్తాది. నానేమి కలపను బాబయ్యా!" అంటూ నవ్వు మొహంతో సమాధాన మిస్తుంది. ఆ కబురూ, ఈ కబురూ చెబుతూనే మజ్జిగ గంటలో అమ్మేస్తుంది. ఒకరోజు చెట్టుక్రింద రాజులమ్మ కనిపించకపోతే, అలవాటుగా వచ్చే వాళ్ళంతా వెర్రెత్తిపోయి ప్రక్కనే వున్న బసవయ్యను అడుగుతూ వుంటారు. అతనికి మాత్రం రాజులమ్మ ఎందుకు రాలేదో ఏం తెలుసు? "నాకూ తెలీదయ్యా" అని సమాధానం చెప్పలేక సతమతమవుతూ వుంటాడు.


ఆదికాక పోయినా రాజులమ్మ కూడా ఎంతో విలుకాని పరిస్థితి వుంటేగాని బజారుకు వెళ్ళడం మానదు. అయినా మజ్జిగ అమ్మితేనే కదా రోజుగడిచేది. కొద్దిపాటి జ్వరాన్ని రాజులమ్మ లెక్కచేయదు. ఎవరితోనూ చెప్పుకోదు. తట్ట ఎత్తుకోవలసిందే. నిన్న రాత్రి అవుపాలు పితకక తన ఖాతాలు పోతాయని రాత్రి పాలుకొని కాసి, తోడెట్టింది.

మనవరాలు సీత ఆ వూరు బడిలో మూడవ తరగతి చదువుతుంది. సీతని చదివించాలని రాజులమ్మకు లేదు. టీచరమ్మ సీతను చదివించమని చదివిస్తే వచ్చేలాభాలు తెలియ చేసిన గురించి రాజులమ్మ సీత చదువుపట్ల ఆసక్తి కనపరచడం మొద లెట్టింది. "మాలాటోళ్ళకు సదువేటి!" అనుకునే రాజులమ్మ" మాలాటోరు సదువుకోవాల. సదువుకోవచ్చు" అని తెలుసుకుంది.

దానితో రాజులమ్మ మనసుమారిపోయింది. గౌరి సంరక్షణకు సీత అభివృద్ధికి, తన శక్తినంతా కేంద్రీకరిస్తూంది. రాజులమ్మ ఆలోచనలు ఎప్పుడూ ఆ ఇద్దరి చుట్టూ తిరుగుతూ వుంటాయి. గౌరికి దిష్టి తగిలిందనిపిస్తే, గౌరితో పాటు సీతకి దిష్టితీస్తుంది. సీతకి దిష్టి తగిలిందనిపిస్తే, సీతతో పాటు గౌరికి కూడా దిష్టి తీసేది. ఇద్దరినీ తన రెండు కళ్ళులా చూసుకుంటుంది.

అరవై సంవత్సరాలు పైబడిన రాజులమ్మలో సత్తువ సన్నగిల్లినా ఇంకా ఆ రెండు జీవాల కోసం ప్రాకులాడుతూనే వుంది. రెక్కాడతేగాని డొక్కనిండని తన బ్రతుకును గురించి అప్పుడప్పుడూ తిట్టుకుంటుంది. రాజులమ్మకి ఈ మధ్య గుండెపోటు వస్తోంది. దానికి చికిత్స చేయిస్తే తన మనవరాలికి కూడ బెట్టే డబ్బు తక్కువ అవుతుందని మందు తీసుకోకుండా అలాగే కాలాన్ని నీరసంగా ఈడ్చుతోంది.





* * * * *

మజ్జిగ త్వరగా అమ్ముడయింది. కడవ, గ్లాసులు కడిగి గంపలో సర్దింది. చిక్కంలో ఉన్న చిల్లరంతా పేర్చి లెక్క పెట్టుకుంది. ఆ రోజు అమ్మకం పదమూడు రూపాయలన్నర. చిక్కంలో వున్న కాగితాలు కూడా తీసి లెక్కపెట్టి పదహారు రూపాయలు అనుకుంది. "మొత్తం ఇరువై తొమ్మిదిన్నర' అనుకుంది. అందులో పదిరూపాయలు టీచరమ్మకివ్వాలి మిగతా డబ్బుతో సీతకి గౌను, పరికిణీ, అవుకికొంటు బియ్యం, వంట సామాగ్రి కొనాలనుకుంది. మనవరాలు భవిష్యత్తు కొసం టీచరమ్మ దగ్గర సొమ్ముదాస్తుంది. చిక్కం బొడ్డు దగ్గర దోపుకుని తట్ట నెత్తిన పెట్టుకొని కర్రపట్టుకొని బసవయ్యతో వెళ్ళివస్తానని చెప్పి, ముందుకు నడిచింది.

"పిల్లది బళ్ళో సదువుతుండగా సూల్లేదు. ఈయేల సూత్తేనో!" అని అనుకుంటూనే బడివైపు నడిచింది.

బడిదగ్గరకు వచ్చిన రాజులమ్మకి లోపలనుంచి

పిల్లల అలికిడి వినిపించింది. తట్ట దింపకుండానే బడిమెట్లు ఎక్కింది. మెల్లగా అడుగులువేస్తూ వరండాలోకి వెళ్ళింది. అక్కడ ఉన్న గది గుమ్మం దగ్గర నుంచొని లోపలికి చూస్తోంది. గదిలో పిల్లలు బల్లల మీద కూర్చుని వున్నారు. వాళ్ళకు ఎదురుగా టీచరమ్మ టేబిలు దగ్గర కుర్చీలో కూర్చుంది. టేబిలు దగ్గర సీత నిలబడి పుస్తకంలో పాఠం చదువుతుంటే, మిగతా పిల్లలు శ్రద్ధగా వింటున్నారు.

"ఇదే కాబోలు పాఠాలు సెప్పడం అంటే ఆ పిల్లలందరికంటే తన మనవరాలు బాగా సెదువు తుందేమో! అందుకే దానిసేత టీసరమ్మగారు సదివిత్తున్నారు సీత ఎంత బాగా సదువుతుంది" అని మనవరాలువంక రాజులమ్మ ముచ్చటగా చూస్తోంది.

పాఠాల దీక్షలో పడి రాజులమ్మ రాకను ఎవరూ గుర్తించలేదు. సీత చదివినదానికి టీచరమ్మ "ఊ" అని ఊ కొడతూ మధ్య మధ్య, 'అలాకాదు ఇలా చదవాలి' అని చెబుతూంది.

మనవరాలు చదివే తీరు విధానం, టీచరమ్మ చెప్పే తీరు, అవేమి అర్థం కాకపోయినా, వింతగా ఆనందంగా చూస్తుంది రాజులమ్మ గంటకొట్టగానే పిల్లలు బిలబిలా గోల చేస్తూ పుస్తకాలు పట్టుకొని బయటకు పరుగెడుతున్నారు

"సైలెన్సు! అల్లరి చేయ్యకుండా నిశ్శబ్దంగా వెళ్ళండి" అంటూ టీచరమ్మ గుమ్మం వంక చూసింది ఆమెకు రాజులమ్మ కనిపించింది "రాజులమ్మా! ఏమిటి ఇలా వచ్చేవు. సీతకోసమా!" అని అడిగింది.

"అవునండమ్మగోరూ! బజారు పని బేగో అయిపోయింది సీత బళ్ళో ఎలా సదువుతున్నాదో సూడాలనొచ్చే!

టీచరమ్మ నవ్వి, "బడి విడిచి పెట్టేం" అని నొచ్చుకుంది.

"సీత సదువుకోడం ఇన్నానమ్మా! సానా బాగా సదువుతున్నాది."

"నీ మనవరాలు తెలివైంది రాజులమ్మా! తరగతిలో అందరికంటే బాగా చదువుతుంది. నేను ఒకపాఠం

# కామధేనువు

చెపితే సీత రెండవ పాఠం కూడా చదువుతుంది దాని చదువు గురించి నీవు చూడవసరంలేదు' అని చెబుతుంటే రాజులమ్మకు వొడిలో డబ్బుమూట పడినంత ఆనంద పడింది

"అంతా మీ దయమ్మగోరూ! అయ్యా! అమ్మాలేంది దానికి కూడూ, గుడ్డా పెట్టించి సదువు సెబుతున్నారు'

"వీళ్ళకయ్యే ఖర్చు నాదికాదు అంతా ప్రభుత్వం సొమ్ము" అంది టీచరమ్మ.

'అయన్ని మాకేటి తెల్సమ్మా!.దిక్కూ మొక్కూలేని పిల్లల్ను ఆదరింసి సదువు సెపుతున్న మాలచ్చివని మావు సెపుకుంట్నున్నామమ్మా!'

'అంతా మీ భ్రమ "

"మీ మేలు ఈ జనమలో తీర్చుకోలేనమ్మా! అయ్యో! మజ్జిగంతా అయిపోనాదే ఒక గళాసేనా మజ్జిగ మీకిచ్చుకోనాకి! రేపుటేల సిక్కటి పెరుగుబిళ్ళ మా సీతతో పంపుతా అదే మీకు బగుమాన మనుకోండి. అంతకన్నా నేనే మిచ్చుకోగల్ను మీకు' అంది రాజులమ్మ

టీచరమ్మ డ్రాయరు మీద పుస్తకాలు సొరుగులో సర్దుతూనే రాజులమ్మతో మాట్లాడుతూంది ఆ ఇద్దరి మాటలూ సీత వింటూంది. రాజులమ్మ తట్టదించుకుని, లోపలికివచ్చి, సీత బుగ్గలు పట్టుకొని ఆ చేతిని ముద్దెట్టుకుంది. చిక్కంలొంచి పదిరూపాయలు తీసి, టీచరమ్మకిచ్చింది.

"నీ కడపు మాడ్చుకుని మనవరాలకు డబ్బు కూడ బెడుతున్నావు రాజులమ్మా!"

"ఎండుపోయే సెట్టుకు నీరెందుకమ్మా! పెరిగే మొక్కకి కావాలిగాని"

"నీ ఆరోగ్యం బాగుంటేనే నీ మనవరాలికి మంచి చెడ్డలు చూడగలుగుతావు" అని టీచరమ్మ లేచి నిలబడింది

"మా సీత బాగోగులు గురించి నాకు బెంగలేదమ్మా సత్తమ్మ కియ్యవలసిన బాకీ నా గుండెలమీద కుంపటిలా వుందమ్మగోరూ!"

"సగం అప్పుతీర్చేవుగా! మిగతాది కూడా తీర్చేస్తావు దాని గురించి మనసు పాడుచేసుకోకు" అంటూ బయటకు నడుస్తున్న టీచరమ్మను రాజులమ్మ, గొడుగు ప్లాస్కు పట్టుకుని సీత అనుసరించారు.

★ ★ ★ ★

ఇంటికి వచ్చిన రాజులమ్మకి ఆవు కనిపించగానే దానికి కొంటు, సీతకి గౌను, పరికిణీ కొనడం మరిచి పోయిన గురించి నొచ్చుకుంది దాయిలుమీదున్న పాలసట్టి దింపి గదిలోకి పట్టుకు వెళ్ళింది. పాలుతోడెట్టటానికి అలమారులో ముంతలో దాసిన పెరుగు బిళ్ళ తీసి, పాలసట్టిలో పోసి దానిమీధ మూకిడి మూతపెట్టి, తలుపుగొళ్ళెంపెట్టి తాళం వేసింది ఆవుకి నీళ్ళుపెట్టి, గడ్డివేసి, బొడ్డు దగ్గర చిక్కం తడుముకుని, గోనెసంచి పట్టుకుని రాజులమ్మ బయటకు నడిచింది

★ ★ ★ ★ ★

రోజులు 'యధాలాపంగా గడిచిపోతున్నాయి బయట నుంచి ఇంటికి వచ్చిన రాజులమ్మ సీతమీద కేకలు వేస్తున్న సత్తెమ్మ కనిపించింది సీత ఎంతో నెమ్మదిగా ఏదో చెబుతొంటే సత్తెమ్మ చేతులు విసురుతూ సీతమీదకు వెళ్ళటం చూసిన రాజులమ్మకు కోపం ఆగలేదు

సత్తమ్మా ఆగు!" అంటూ గట్టిగా అరచింది

సత్తెమ్మ చట్కున వెనక్కు తిరిగి,"అంతగట్టిగా అరుస్తావేవమ్మా! నీ అరుపులకు బెదిరే వాళ్ళెవరూ లేరిక్కడ. అప్పున్న దానివి అణిగి మణిగి ఉండాలేగాని అరవకూడదు. మీ మామ్మ ఎక్కడుందే అని అడిగితే ఈ గుంట పెడుసు కబురులు చెబుతుంది ఇదంటే నేను పడాలా? వేలెడు లేదు!" అని సత్తెమ్మ ఏమేమో సీతని తిట్టడం మొదలెట్టింది

"దానికేం తెలుసు? దానినెందుకలా నీ నోట్లో పడేసు కొంటావు? దాని నేమనమాకు" అంది రాజులమ్మ

"ఎవరు ఎవరిని ఏమి అనలేదు. అది అలా వుంచు నా సొమ్ము సంగతి ఏటో తేల్చు. నాకు డబ్బు అవసరం. ఇప్పుడు కావాలి" అని నిగ్గదీసి అడిగింది.


"ఇత్తాను ఇయ్యక పోతే నువ్వూరుకుంటావా. కిందటి నెలేగందా నూరు జమకట్టాను. కూసింత ఓపిక పట్టు" అంది రాజులమ్మ.

"పడతా, పడతా, ఓపిక పట్టనూ..... అప్పు పుచ్చుకునేటప్పుడు బతిమాలతారు. తీరమని అడిగితే మేమేదో పీక్కు తింటున్నట్లు మాట్లాడుతారు. నీకొడుకు కోడలు సెవాల్ని కాల్చడానికి డబ్బు లేదని కాళ్ళా వేళ్ళా పడతే యిచ్చేను"

'అందుకే కదమ్మా! వడ్డీకడుతూ, అసల్లోది సగం డబ్బుకూడా యిచ్చేను. తక్కిన సొమ్ము కూడా కొంత వోపిక పడతే అది కూడా యిచ్చుకుంటా!"

"వోపిక పట్టబట్టే ఇంతకాలం ఆగాను. ఇప్పుడు డబ్బవసరం ఇప్పుడు కావాలి."

"ఇలా పీకి మీద కూకుంటే నేనేం సేయను ఇంటి



మిద అప్పు పూఛ్చించడానికి నలుగురు కాళ్ళా అట్టుకున్నా కుదరలేదు. రెక్కల మిద కూడ బెట్టాలగదా నీకు తెలవందే వుంది. కూడ బెట్టి కూడ బెట్టి నీకే యిత్తున్నాగా!" నచ్చ చెప్ప టానికి ఎంతో ప్రయత్నించింది రాజులమ్మ కాని ససేమిరా వీల్లేదంది సత్తెమ్మ. బాకి ఇస్తేగాని కదలనని మొండి కెత్తింది. ఇంతలో సీత ఏదో చెప్పబోతే సత్తెమ్మ ఆ పిల్లని దూరంగా తోసింది. అది చూసి కూడా రాజులమ్మ సహించింది. ఆమె చేతులు పట్టుకుని బ్రతిమాలింది రాజులమ్మ ఆమె ప్రాధేయ పడిన కొలదీ సత్తెమ్మ మరింత బిగిసి పోయింది.

అదును కొసం ఎదురు చూస్తున్న రామయ్య రాజులమ్మ దగ్గరకు వచ్చాడు. ఏమిటి గొడవ అంటూ విషయం తెలుసుకున్నాడు రామయ్యను చూడగానే రాజులమ్మకి ఆశ్చర్యం వేసింది. ఎన్నడూ రాని వాడు ఇలా వచ్చేసరికి. అయన పరిష్కారం చెపుతాడేమో నని రాజులమ్మ అతని వంక ఆశగా చూసింది.

సత్తెమ్మ చెప్పిన దంతా విన్న రామయ్య. "అప్పు పుచ్చుకున్న తరువాత తీర్చక పోతే ఊరుకుంటారా రాజులమ్మా!" అని అన్నాడు.

"రావయ్య బాబూ! నా ఇంటి మిద మూడొందలు సర్దు బాబూ! సచ్చి నీకడుపున పుడతా!" అంది రాజులమ్మ దీనంగా చూస్తూ.

"అపదలో వున్న వాళ్ళను ఆదుకోవడం ధర్మం ప్రస్తుతానికి నా దగ్గర చిల్లి గవ్వలేదు. కాని నీ బాధ చూడలేక పోతున్నాను. సరే అమ్మాయి బాపతు సొమ్ము ఉంది. దానిని సర్దుతానులే!" అన్నాడు రామయ్య.

రాజులమ్మకు పోయిన ప్రాణం వచ్చినట్టయింది. "మరెయితే ఇప్పుడే కాగితం రాయించేద్దాం. సీతా!" సీత పలకలేదు. మళ్ళీ పిలిచింది

"ఇంటి మిద అయితే డబ్బు ఇవ్వడం కుదరదు" అన్నాడు రామయ్య

"ఎలామరి, ఏటి సెయ్యాలి' అని రాజులమ్మ అడిగింది

"రాజులమ్మా! నేను చెప్పినట్టు నీవు ఇంటేని బాకి

# కామధేనువు

పోను ఇంకా సొమ్ము మిగులు తుంది దానితో బియ్యం కొట్టు పెట్టుకొని బ్రతుకుదువుగాని" అని చెప్పాడు.

"ఏటి సెయ్యమంటారు?"

"నీ అవుకు వెయ్యి రూపాయలిస్తాను. కాదు కూడదంటె ఇంకో రెండొందలు ఇస్తాను ఏమంటావు" అన్నాడు

రాజులమ్మకు గుండె ఆగిపోతున్నట్టు అనిపించింది. ఆ నాడు పశుప్రదర్శనానికి తీసుకు వెళ్ళవద్దన్నా వినకుండా టీచరమ్మ గౌరిని తీసుకు వెళ్ళింది. రాజులమ్మకు సుతరామం ఇష్టం లేదు పదిమందిలో గౌరిని నిలబెడితే దిష్టి తగులు తుందని గౌరికి దిష్టి తగులుతే దానిమిద బ్రతికే తమ బ్రతుకుల్లో చిక్కులు ఏర్పడతాయని కాని రాజులమ్మతో బహుమతి వస్తే డబ్బు వస్తుందని. నచ్చ చెప్పి టీచరమ్మ గౌరిని ప్రదర్శనలో అవుల పాల పోటీలో నిలబెట్టింది.

టీచరమ్మ చెప్పినట్టు గౌరికి ప్రదర్శన పాల పోటీ ప్రథమ బహుమతిగా 116 రూపాయలు, జాతిలో వెండిగంట వచ్చాయి. ఆరోజే రామయ్య గౌరిని తన కిచ్చెయ్య మని అడిగాడు. అప్పుడు అతను సరదాపడి అడిగాడని ఊరుకుంది రాజులమ్మ కాని తన అవు మిద రామయ్య నిగాతో ఉన్నాడని. రామయ్య సత్తెమ్మతో చేతులు కలిపి ఆడుతున్న నాటకమని గ్రహించుకుంది రాజులమ్మ.

"ఏటి రాజులమ్మా! ఇంకా ఆలోసిత్తా వేటి రావయ్య గోరంత టోరొచ్చి. ఎంతో ధర అవుకిత్తానంటె వెనకాడతావే" అని చెప్పింది సత్తెమ్మ

రాజులమ్మ పిచ్చిదానిలా చూసింది రామయ్యను, సత్తెమ్మను మార్చి మార్చి చూసి, "గవురిని అమ్మను" అని అరిచింది

"నువు మొండి కెత్తుతె నేనూరుకోను గవురిని రావయ్య గోరికి వప్పసెప్పు" అని కర్కశంగా అంది సత్తెమ్మ.

"రావయ్య బాబూ! నా గవురిని తోలికెల్లి మా నోటికాడ కూడదగొట్టకు బాబూ!" అని దీనంగా అడిగింది రాజులమ్మ

నాదేముంది. మిరు అమ్మితే అవును కొంటాను లేకపోతె వెళ్ళిపోతాను" అన్నాడు రామయ్య

'రావయ్య గోరూ! అవును మికమ్ముతాను నా బాకి మిరు జమకట్టండి" అని చెప్ప సత్తెమ్మ గౌరికన్నె తాడు కట్టు కొయ్య నుండి విసురుగా లాగింది

రాజులమ్మ ఏడుస్తూ అడ్డు పడింది. సత్తెమ్మ ఆమెను త్రోసి, రామయ్యకు తాడు అందించింది. రాజులమ్మ నేల మిద వెల్లకిల్లా పడిపోయింది గౌరికి అడ్డంగా. రామయ్య ముందుకు లాగుతుంటె, గౌరి వెనక్కి లాగుతూంది.

సీత వెళ్ళి టీచరమ్మను తీసుకు వచ్చింది. టీచరమ్మ అక్కడ సంఘటన చూసి నిర్ఘాంత పోయింది 'వేటకు వెళ్ళిన విశ్వామిత్ర మహారాజు, వసిష్టముని ఆశ్రమంలో ఉన్న కామధేనువును చూసి, కన్నుపడ్డట్టు. పశు ప్రదర్శనలో గౌరికి బహుమతి రావడం రామయ్యకు కన్ను కుట్టింది. అనవసరంగా గౌరిని ప్రదర్శనలో ఎందుకు పెట్టానా!' అనుకుని బాధపడింది టీచరమ్మ ఎరను చూపి చేపను పట్టినట్టు. రామయ్య సత్తెమ్మను అసరా చేసుకుని వచ్చాడని గ్రహించింది టీచరమ్మ. గౌరిని రక్షించె విధానం ఏమిటని ఆలోచించిన టీచరమ్మకి ఏదో జ్ఞాపకం వచ్చినట్టు ఆనందించి . మళ్ళీ అంతలోనే ముఖంలో క్రోధరేఖలుతో, "రామయ్య గారూ! గౌరిని తీసుకు వెళితే మి చేతులకు బేడిలు పడతాయి". అంది టీచరమ్మ

"మేవు దొంగ సాటున తోలుకు ఎల్లడంలేదు. పది మందిలోనూ , రావయ్య గోరికి నా బాకికి గవురిని అమ్మివేసాను. మా నేతులకు సంకెల్లు ఎందు కేత్తారు' అని దిమాగా చెప్పింది సత్తెమ్మ.

"అమ్మడానికి సత్తెమ్మ ఎవరు. కొనడానికి రామయ్యగా రెవరు ఆ అవుని ప్రభుత్వం సబ్సిడిలో రాజులమ్మ కిచ్చింది దానిని అమ్మే హక్కు కాని, కొనే హక్కుగాని ఎవరికిలేదు మిరు బలవంతాన గౌరిని తీసుకు వెళితే ప్రభుత్వం వారు మి చేతులకు సంకెళ్ళు వేస్తారు" అని టీచరమ్మ చెప్పగానే రామయ్య చేతిలో తాడు క్రిందపడింది

"మరి నా బాకి మాట" సత్తెమ్మగొంతు జీరపోయింది

"రాజులమ్మను అడుగు" అంది టీచరమ్మ

సత్తెమ్మ రాజులమ్మ వంక చూస్తూ, "రాజులమ్మా! మాటా మంతి లేకుండా నేల మీద తొంగుంటె బాకి పోతుందనుకున్నావా! లేచి, నా బాకి మాట సెప్పు" అంది.

రాజులమ్మ సమాధాన మివ్వలేదు.

సత్తెమ్మ రాజులమ్మ దగ్గరకు వెళ్ళి, ఆమె ముక్కు దగ్గర వేలు పెట్టి చూసి,"నా గొంతుకోసి ఎల్లి పోయావా రాజులమ్మా!" అని సత్తెమ్మ శిరసు బాదుకుంది గౌరి రాజులమ్మ పాదాలను కన్నీరుతో నాకుతూంది □

